సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఏడీసీ దృష్టికి 89వ వార్డు సమస్యలు



జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న గోపాలకృష్ణ

గోపాలపట్నం: జీవీఎంసీ అదనపు కమిషనర్ వి.సన్యాసిరావును ఆయన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ 89వ వార్డు నాయకుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ(గోపి) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు వార్డులో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వార్డు అభివృద్ధికి సహకరించాలని కోరారు.

2 కిలోల లిక్విడ్ గంజాయి పట్టివేత

- పోలీసుల అదుపులో నలుగురు



పోలీసులు స్వాధీనం చేసుకున్న లిక్విడ్ గంజాయి, సెల్‌ఫోన్లు, నగదు

గోపాలపట్నం: లిక్విడ్ గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలిలా.. శనివారం సాయంత్రం ఎన్ఏడీ ఫ్లైఓవర్ బ్రిడ్జ్ వద్ద అక్రమంగా వీడ్ ఆయిల్‌ను తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 2 కిలోల వీడ్ ఆయిల్(లిక్విడ్ గంజాయి), రూ.4,020 నగదు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరితోపాటు లిక్విడ్ గంజాయిని ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: విద్యార్థులకు ఇంటర్న్‌షిప్స్ కల్పనపై శనివారం రాష్ట్ర ఉన్నత విద్యమండలి సమీక్ష సమావేశం నిర్వహించింది. రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, కంప్యూటర్ సెంటర్ సంచాలకులు భాస్కర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏయూ పరంగా ఇంటర్న్‌షిప్ కల్పనకు జరుగుతున్న కృషిని వివరించారు. వర్సిటీ పరంగా పూర్తిస్థాయిలో ఇంటర్న్‌షిప్స్ కల్పిస్తామని రిజిస్ట్రార్ వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

జగదాంబ: కాన్వెంట్ జంక్షన్ ఫ్లై ఓవర్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై హార్బర్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎస్ఎస్‌వీఎస్ఎన్ రాజు అనే వ్యక్తి విశాఖపట్నం పోర్టు ట్రస్ట్‌లోని శ్రీనివాస కాటా నుంచి విధులు ముగించుకుని శుక్రవారం రాత్రి వస్తున్నారు. ఆయన గాజువాక వైపు వెళ్తుండగా కాన్వెంట్ జంక్షన్ ఫ్లై ఓవర్ ఎంట్రన్స్ వద్ద సుమారు 45 ఏళ్ల వయసు గల వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. మృతుడి కాలు, తల నుజ్జునుజ్జు అయి ఉందని, అతన్ని ఏదో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయి ఉంటుందని తమకు ఫిర్యాదు చేసినట్లు హార్బర్ పోలీసులు తెలిపారు. మృతుడు 5.5 అడుగుల పొడవు ఉన్నాడని, చేతి వేలికి ఉంగరం, నల్లని నిక్కరు, తెల్లని వైట్ టీ షర్టు వేసుకున్నట్లు హార్బర్ పోలీసులు తెలిపారు. ఈ విషయమై 9154879915, 8331041665 నంబర్లలో హార్బర్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు పేర్కొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నియంత్రణ

- రహదారి నిబంధనలపై విస్తృత ప్రచారం
- జోన్–2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న జోన్–2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్

గోపాలపట్నం: అవగాహనతోనే ప్రమాదాలను నివారించవచ్చునని జోన్–2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ అన్నారు. శనివారం ఎన్ఏడీ సమీపంలోని ఎన్ఎస్‌టీఎల్ జంక్షన్ వద్ద మహిళా పోలీసులు, ఆటో డ్రైవర్లకు రహదారి నియామవళిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు నివారణకు రాష్ట్రప్రభుత్వం, పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నాయన్నారు. వాహన చోదకులతో పాటు పాదచారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు. మహిళా పోలీసులు ఇందులో కీలకంగా వ్యవహరించాలన్నారు. ఆయా సచివాలయం పరిధిలో ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. అలాగే నేరాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. నేరాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్న అనుమానం ఏర్పడినా సమాచారమిస్తే దాన్ని అడ్డుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. మీ ప్రాంతాల్లో ఏచిన్న విషయమైనా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వాలన్నారు. జీబ్రాలైన్స్‌పైనే వెళ్లాలని పాదచారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఆక్రమణలు తొలగించండి

ఫుట్ పాత్ ఆక్రమణలు ఉంటే సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శుల సహకారంతో తొలగించాలని సూచించారు. అవసరమైతే ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు సహకారం తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు మనం పని చేయాలన్నారు.

నిబంధనలు పాటించాలి

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించక పోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఆటోలు నడపడం.. రోడ్డుపై అడ్డంగా నిలిపి వేయడం వంటివి చేయడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అతివేగం, దురుసుగా ప్రవర్తించడం వల్ల నిత్యం ప్రమాదాలు జరురుగుతున్నాయని తెలిపారు. నగరంలో ఆటోల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లు జాగ్రత్తగా నడపాలని సూచించారు. అన్ని పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు మళ్ల అప్పారావు, అశోక్ కుమార్, ఉమామహేశ్వరరావు శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత లోపిస్తే చర్యలు



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లావణ్య

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను శనివారం వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య పరిశీలించారు. జీవీఎంసీ పాఠశాలపై అదనపు భవన నిర్మాణం చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఆమె పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు లేవని గుర్తించి సమస్యను పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్,నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వారు స్పందించి ఇక్కడ అదనపు భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించేలా చర్యలు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు కృష్ణ, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు డైరెక్టర్ చుక్క వరలక్ష్మి, పొడుగు రాజు తదితరులు పాల్గొన్నారు.

కూల్ కూల్‌గా..

- వానతో సేద తీరిన జనం



పారిశ్రామిక ప్రాంతంలో కురుస్తున్న చిరుజల్లులు

మల్కాపురం: రెండు వారాలు ఎండ తీవ్రతకు విలవిల్లాడిన ప్రజలు రెండు రోజులుగా సేదతీరుతున్నారు. అగ్నిగుండాన్ని తలపించే విధంగా భానుడు ఉగ్రరూపం చూపాడు.దీంతో ఈ నగరం చల్లబడేదెప్పుడు అంటూ జనం అల్లాడారు. ఎట్టకేలకు రుతుపవనాలు ప్రారంభం కావడంతో వాతావరణం ఒక్కసారిగా మారింది. ఎండ తగ్గింది. శనివారం ఉదయం నుంచి మబ్బులు వేసింది. ఆగి ఆగి చిరు జల్లులు కురిసింది. దీంతో రోజంతా కూల్‌కూల్‌గా ఉంది. జనం సేద తీరారు. హమ్మయ్యా అంటూ ఆనందం వ్యక్తం చేశారు.

పీఆర్ఎస్ఐ జాతీయ కార్యదర్శిగా పీఎల్‌కే మూర్తి



ఎన్నికైన సభ్యులు

కొమ్మాది: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల ప్రజా సంబంధాల అధికారులు సభ్యులుగా గల భారత ప్రజా సంబంధాల సంఘం (పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా) జాతీయ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ పీఎల్‌కే మూర్తి ఎన్నికయ్యారు. ఈ మేరకు న్యూ ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్‌లో శనివారం జరిగిన ఎన్నికల్లో ఆయనను ఎన్నికల అధికారి సుభాష్ సూద్ ప్రకటించారు. జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ అజిత్ పాఠక్ ఎన్నికయ్యారు. దక్షిణ భారత విభాగానికి విశాఖకు చెందిన హెచ్‌పీసీఎల్ విశ్రాంత అధికారి యూఎస్ శర్మ ఎంపికయ్యారు. జాతీయ కార్యదర్శిగా ఎంపికైన డాక్టర్ పీఎల్‌కే మూర్తి విశాఖ పి.ఐ.ఎస్.ఐ చైర్మన్‌గా, కార్యదర్శిగా సేవలు అందించారు.

ఆటో డ్రైవర్ అదృశ్యం



వెంకటప్రసాద్

బీచ్‌రోడ్డు: ఆటో డ్రైవర్ అదృశ్యంపై మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం శ్రీహరిపురానికి చెందిన డి.వెంకట ప్రసాద్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలాగే ఈ నెల 16న ఉదయం 9 గంటలు ఇంటి నుంచి ఆటోలో బయలుదేరాడు. ఆ రోజు రాత్రి 10 గంటలైనా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య గుణలక్ష్మి ఫోన్ చేసి చేసినా స్పందించలేదు. మరోసటి సీబీఎం కాంపౌండ్ దగ్గర నివాసం ఉంటున్న బంధువుల ఇంటి వద్ద ఆటో పార్క్ చేసి ఉండడాన్ని గమనించారు. అందులోనే మొబైల్ కూడా ఉంది. రెండు రోజులుగా ప్రసాద్ జాడ కోసం విచారించినా ఎటువంటి వివరాలు తెలియకపోవటంతో మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు

- జిల్లా ప్రత్యేక అధికారి కోటేశ్వరరావు



యూపీహెచ్‌సీని పరిశీలిస్తున్న సీడీఎంఏ కోటేశ్వరరావు, కమిషనర్ సాయికాంత్ వర్మ

ఆరిలోవ: నగరంలోని యూపీహెచ్‌సీల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలని సీడీఎంఏ, జిల్లా ప్రత్యేక అధికారి పి.కోటేశ్వరరావు ఆదేశించారు. పదో వార్డు వివేకానందనగర్‌లో యూపీహెచ్‌సీని శనివారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావుతో కలసి ఆయన సందర్శించారు. ఇక్కడ యూపీహెచ్‌సీని పరిశీలించారు. ఏ ఏ వైద్య సేవలు అందుతున్నాయి? ఎంతమంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నారు? ఇక్కడ మందులు, పరికరాలు, సిబ్బంది, మౌలిక సదుపాయాలు తదితర వాటి గురించి డీఎంహెచ్‌వోని అడిగి తెలుసుకొన్నారు. ఇక్కడకు వచ్చిన రోగులతో ఆయన మాట్లాడి అందుతున్న వైద్య సేవలుపై ఆరా తీశారు. రోజూ ఓపీ ఎంత నమోదువుతోందో అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బందిపడకుండా మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. రోగుల తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భనలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు శ్రీనివారావు, డాక్టర్ సన్యాసిరావు, జోన్–2 జెడ్సీ కనకమహలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ కిశోర్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధంపై విస్తృత అవగాహన



డ్రగ్స్ వినియోగంపై సమాచారం కోసం గోడపత్రికలు అతికిస్తున్న పోలీసులు

ఎంవీపీకాలనీ: మాదక ద్రవ్యాల నిరోధానికి అంతా సమష్టిగా పనిచేయాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సీఐ జగదీశ్వరరావు వెల్లడించారు. , ఈమేరకు యువతను యువతను చైతన్యవంతం చేసే దిశగా పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యాక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా శనివారం ఎంవీపీ కాలనీతో పాటు నగరంలోని పలు పాఠశాలలు, కళాశాలలలో జరిగిన అవగాహన కార్యక్రమాల్లో ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, సూపరింటిండెంట్ బి.శ్రీనాథుడు అతిథులుగా పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. తెలిసీతెలియని వయసులో మాదక ద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలకు బానిసకావడం వల్ల శారీక సామర్థ్యం, మానసిక సామర్థ్యం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. తద్వారా ఉన్నతంగా ఎదగాల్సిన విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడుతుందన్నారు. ఈ మహమ్మారిని నిర్మూలించడంలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా 14500 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. నగరంలో అనేక ప్రాంతాల్లో టోల్ ఫ్రీ నంబర్‌తో కూడిన పోస్టర్లు అతికించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు

గోపాలపట్నం: ఎన్ఏడీ జంక్షన్ గురజాడనగర్‌కు చెందిన యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదైంది. మర్రిపాలేనికి చెందిన బాలికకు మాయ మాటలు చెప్పి విజయనగరం తీసుకువెళ్లి పెళ్లి చేసుకునేందుకు యత్నించాడు. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ సీఐ బీఎండీ ప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 20న బాలిక తప్పిపోయిందని బాలిక తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన పోలీసులు సెల్‌ఫోన్ ట్రాకింగ్ ద్వారా విజయనగరం జిల్లా గజపతినగరంలో ఉన్నట్టు గుర్తించారు. వెంటనే అక్కడకు వెళ్లి బాలికను కిడ్నాప్ చేసిన సోమాదుల పవన్‌ను అదుపులోకి తీసుకున్నారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి అనంతరం తల్లి దండ్రులతో ఇంటికి పంపించారు. పవన్‌కు ఏడాది కిందటే వివాహమైంది. స్థానికంగా వివాహాలకు, ఈవెంట్లకు లైటింగ్ పనులు చేస్తుంటాడు. అయినా బాలికను ప్రేమించానని నమ్మించి.. మాయమాటలు చెప్పి తీసుకుపోయాడని బాలిక తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌పై ఎయిర్‌పోర్టు పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

27న సింహగిరిపై వరదపాయసం సేవ

సింహాచలం: సింహగిరిపై ఉన్న వైకుంఠవాసుడి మెట్టపై ఈనెల 27న వరదపాయసం సేవ నిర్వహించనున్నట్టు శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో డి.భ్రమరాంబ తెలిపారు. వర్షాలు సంవృద్ధిగా కురవాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని సింహగిరి వైకుంఠవాసుడి మెట్టపై కొలువుదీరిన వైకుంఠవాసుడి సన్నిధిలో వరదపాయసం సేవ నిర్వహించడం పూర్వకాలం నుంచి వస్తోందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి వరదపాయసం సేవ ఉంటుందని తెలిపారు. వైకుంఠవాసుడికి విశేష పూజలు, పంచకలశ స్నపనం, పాయసం నివేదన ఉంటాయన్నారు. అనంతరం జారుడుబల్ల ఆకారంలో ఉండే కొండపై నుంచి పాయసం జారవిడవడం జరుగుతుందన్నారు.

కార్మికులకు భద్రత కల్పించాలి

డాబాగార్డెన్స్: కాంట్రాక్టర్లు కార్మికులకు భద్రత కల్పించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. యూనియన్ ఉపాధ్యక్షుడు శీరరమణ మాట్లాడుతూ సూర్రెడ్డి అనే కార్మికుడు ఎలక్ట్రిల్ పని చేస్తూ పోల్ ఎక్కినప్పుడు అనుమానాస్పదంగా మృతి చెందాడని, గట్టిగా అడిగితే కార్మికుడు పోల్ ఎక్కి పడిపోయాడని కాంట్రాక్టర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు కాంట్రాక్టర్ అనే వాడు భద్రత కల్పించాల్సిన బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ కార్మికుడు చనిపోతే ఇటు జీవీఎంసీ గానీ, అటు కాంట్రాక్టర్ గానీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. చనిపోయిన సూర్రెడ్డి కుటుంబానికి న్యాయం చేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయకపోతే శవపంచనామా జరిగిన తర్వాత మృతదేహాన్ని జీవీఎంసీ వద్దకు తీసుకొచ్చి నిరసన చేపడతామని హెచ్చరించారు.

సేవా రంగంలో యువత పాత్ర కీలకం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎన్ఏడీ పాల్

డాబాగార్డెన్స్: సామాజిక సేవా కార్యక్రమాల్లో యువతే కీలకపాత్ర పోషించాలని, సామాజిక కార్యక్రమాలపై యువతకు అవగాహన ఉండాలని అకడమిక్ స్టాఫ్ కాలేజ్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ఏడీ పాల్ పేర్కొన్నారు. నగరంలోని ఏవీఎన్ కళాశాలలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుపై శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని, ప్రజల స్థితిగతులపై సర్వే నిర్వహించి సమస్యలు గుర్తించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి విద్యార్థులకు ఇదో మహత్తర అవకాశంగా భావించాలన్నారు. అకడమిక్ డీన్ శంకరనారాయణరావు, పైడి రజని, డబ్బీరు గాయత్రి, జీవీఎస్‌వీఎల్ శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు



నో పార్కింగ్ స్థలంలో నిలిపిన లారీలను తరలిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శన్‌రావు

మల్కాపురం: మల్కాపురం ట్రాఫిక్ పోలీసులు కొరడాఝుళిపించారు. సర్వీసు రోడ్లలో నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను పార్కింగ్ చేసిన వారిపై కఠినంగా వ్యవహరించారు. మల్కాపురం నుంచి నౌసేనాభాగ్ వరకు సర్వీసురోడ్లలో నో పార్కింగ్ స్థలాల్లో ఆపిన ఆయిల్ లారీలను శనివారం గుర్తించారు.వెంటనే లారీల డ్రైవర్లను పిలిచి జరిమానాలు విధించారు. వాహనాలను అక్కడ నుంచి తరలించాలని,లేకుంటే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని హెచ్చరించారు.దీంతో డ్రైవర్లు అక్కడ నుంచి ఆయిల్ లారీలను తొలగించారు. ఎస్ఐ సుదర్శన్‌రావు మాట్లాడుతూ మల్కాపురం నుంచి నౌసేనాభాగ్ వరకు రోడ్లకు ఇరుపైపులా భారీ వాహనాలు నిలపరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు.అలాగే పలు చోట్ల నో పార్కింగ్ బోర్డులు అమర్చినట్టు చెప్పారు.అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులు లేని విశాఖకు కృషి



మాట్లాడుతున్న కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ సునీత

సీతంపేట: బాల కార్మిక రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దాల్సిన అవసరం, బాధ్యత అందరిపై ఉందని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం.సునీత అన్నారు. ధరణి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ×బాలల సమస్యలు, పరిష్కారాలు¤ అనే అంశంపై జరిగిన జిల్లా స్థాయి సదస్సులో ముఖ్య అతిథిగా ఆమె ప్రసంగించారు. విశాఖ నగరం రాష్ట్రంలోనే ఒక ప్రముఖ ప్రాంతంగా, ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్‌గా ఉన్న నేపథ్యంలో ఇక్కడి పిల్లల సమస్యలు చాలా ప్రాధాన్యం సంతరించుకున్నాయన్నారు. బాలల సమస్యల పరిష్కారానికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. జిల్లా బాలల సంక్షేమ అధికారి రమేష్ మాట్లాడుతూ పిల్లల కోసం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ తీసుకుంటున్న చర్యలు, పథకాలను వివరించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ నగరంలో పెరుగుతున్న బాల కార్మికులు, లైసెన్స్ లేకుండా నడపుతున్న చైల్డ్ కేర్ సంస్థలు, అధికంగా నమోదవుతున్న బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణాలో సైతం జిల్లా నుంచి కేసులు నమోదు కావడం, మరోపక్క పెరుగుతున్న బాలలపై లైంగిక వేధింపులు.. ఇవన్నీ పరిష్కరించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలపై ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ధరణి సంస్థ కార్యదర్శి బి.హరి మాట్లాడుతూ కార్మిక శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో పిల్లల సమస్యలకు పరిష్కారం చూపవచ్చన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు లయ, సమిధ, చైతన్య స్రవంతి, నేచర్, సకల్య, ఉర్వి విక్రమ్ చారిటబుల్ ట్రస్టు, కెన్ ఫౌండేషన్, వార్డు స్థాయి కమ్యూనిటీ ఆర్గనైజర్స్, వార్డు స్థాయి చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు



నగరంలో తనిఖీలు నిర్వహించిన బృంద సభ్యులు

ఎంవీపీకాలనీ: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై జిల్లా లేబర్ డిపార్టమెంట్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. నగరంలోని ఎంవీపీ కాలనీతో పాటు గాజువాక, దువ్వాడ, గోపాలపట్నం ప్రాంతాల్లో శనివారం ఈ తనిఖీలు జరిగాయి. లేబర్ డిపార్టుమెంట్ అధికారులు, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుల ప్రత్యేక బృందం ఈ తనిఖీలను నిర్వహించింది. పలు షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహిస్తున్న బాలబాలికలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. వారిని పనుల నుంచి విముక్తులను చేయడంతో పాటు యజమానులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా పలువురు బృందం సభ్యులు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, జిల్లా వినియోగదారుల ఫోరం అధికారులు పాల్గొన్నారు.

బొండా కుటుంబ సభ్యులకు పరామర్శ



వెంకట సంతోష్ కుమార్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న పంచకర్ల రమేష్‌బాబు

మహారాణిపేట: ప్రమాదవశాత్తు మృతి చెంది అవయవదానం చేసిన బొండా వెంకట సంతోష్ కుమార్ (వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు బొండా ఉమామహేశ్వరరావు సోదరుడు) కుటుంబ సభ్యులను పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఆయనతోపాటు రీజినల్ ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్ అల్లంపల్లి రాజబాబు, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కొరికాణ మోహన్‌రావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయచందర్, సీనియర్ నాయకులు వానపల్లి ఈశ్వరరావు, చొక్కర శేఖర్, జి.విక్టర్, వెంకట్, ధూళి రఘు, నల్లా రవి, పతివాడ కనకరాజు ఉన్నారు.

అలరించిన సాహిత్య చమత్కారాలు



చమత్కార సాహిత్యాన్ని వినిపిస్తున్న ప్రవచన రాజహంస ధూళిపాక మహాదేవమణి

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి ఆధ్వర్యంలో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రముఖ ప్రవచన కర్త మహాదేవమణి ఆధ్వర్యంలో సాహిత్యంలో చమత్కరాలు కార్యక్రమం ఆహ్లాదకరంగా సాగింది. ఈ కార్యక్రమాన్ని వీఎండీఏ అధ్యక్షులు ఎం.ఎస్.ఎన్.రాజు, పైడా కృష్ణప్రసాద్, రమా గోపాల్, మల్లిక మనోజ్, మలయవాసిని ప్రారంభించారు. అనంతరం సాహిత్యంలో చమత్కారాలు రసమయ ప్రసంగాన్ని మహిదేవమణి ఆరంభించారు. ఊహకందని వస్తు విశేషం చేత కలిగే ఆనందమే చమత్కారమన్నారు. మనస్సు అబ్బురంగా వికసించడానికి చమత్కారం ఎంతో దోహదపడుతుందన్నారు.

పూర్ణానంద స్వామిని కఠినంగా శిక్షించాలి



కృష్ణా కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం

మద్దిలపాలెం: బాలికలపై లైంగిక దాడులకు పాల్పడిన కేసులో అరెస్టు అయిన జ్ఞానానంద ఆశ్రమంలోని పూర్ణానంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. మద్దిలపాలెం డాక్టర్. వి.ఎస్.కృష్ణా కళాశాల ప్రవేశ ద్వారం వద్ద శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామిజీని శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక ముసుగులో ఆశ్రమాల పేరుతో బాబాలు, స్వామీజీలు చేస్తున్న ఆఘాయిత్యాలకు అడ్డు అదుపు లేకుండాపోయిందన్నారు. ఆశ్రమాలపై గట్టి నిఘా పెట్టాలని, అక్కడ చీకటి కోణంలో జరిగే అరాచకాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పడీఎస్‌వో కార్యదర్శి వి.లక్ష్మి, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.